నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | శనివారం 21 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## వ్యభిచార గృహంపై దాడి

వివరాలు వెల్లడిస్తున్న సీఐ శశిధర్ రెడ్డి

మందమర్రి, సెప్టెంబర్ 20 : రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పద్మావతి కాలనీలోగల గద్దెరాగడిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ గృహంపై ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. పద్మావతి కాలనీలోని ఓ అద్దె ఇంటిలో మహ్మద్ మొయిన్-అవంతి అనే దంపతులు మంచిర్యాలలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన సత్తమ్మ అనే మధ్యవర్తి ద్వారా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. ఒక్కో విటుడి నుంచి రూ. 1500 తీసుకుంటున్నారు. అమ్మాయిలను పంపించే సత్తమ్మ రూ. 500, గృహం నిర్వహిస్తున్న దంపతులు రూ. 500, మిగతా రూ. 500 సదరు మహిళకు ఇస్తారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరుకు చెందిన ఓ మహిళకు ఎక్కువ మొత్తంలో డబ్బులు ఆశచూపి వ్యభిచారం చేసేందుకు ఇక్కడికి పిలిపించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి రూ. 1500, ఐదు మొబైల్ ఫోన్‌లు, కండోమ్ ప్యాకెట్ బాక్స్‌లను సీజ్ చేశారు. బాధిత మహిళను సఖీ సెంటర్‌కు పంపించారు. మహ్మద్ మొయిన్, అవంతి దంపతులు, పత్తి సత్తమ్మ, మంచిర్యాలకు చెందిన విటుడు ఆకునూరి సంపత్‌ను అరెస్ట్ చేశారు.

## నాణ్యమైన విద్యనందించాలి

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

కన్నెపల్లి, సెప్టెంబర్ 20 : విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కన్నెపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్, కస్తూర్బా పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. వంట గదులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో గంగామోహన్, ఏపీవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

*హైదరాబాద్‌లో చెరువులు, కుంటల పరిధిలోని నిర్మాణాలను కూల్చివేస్తూ 'హైడ్రా' హడలెత్తిస్తుండగా, మంచిర్యాల జిల్లాలో మాత్రం అధికార పార్టీ లీడర్లే చెరువులను మింగేస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది. ఇటీవల చెన్నూర్‌లోని శనిగకుంట చెరువు మత్తడిని కూల్చివేసిన ఘటనలో 'హస్తం' పార్టీ లీడర్ల మాయాజాలం బయటపడింది. చెరువును ఆనుకొని 15.20 ఎకరాల్లో మట్టిపోసిన వారిలో ఆ పార్టీ కీలక నాయకులే ఉండడం.. ఆ 15.20 ఎకరాల్లో 11 ఎకరాలు చెరువు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) పరిధిలో ఉందని పోలీసులే చెప్పడం.. అక్కడ మట్టిపోయడం వల్లే 11వ వార్డులోని ఇళ్లలోకి వరద వస్తుందని వారు కుండబద్దలు కొట్టడం చర్చనీయాంశమవుతున్నది. మరోవైపు వరద ఇండ్లలోకి రాకూడదనే స్థానిక కౌన్సిలర్ భర్త శనిగకుంట మత్తడిని పేల్చివేశారని వారు స్పష్టం చేయడం స్థానికులను ఆలోచింపజేస్తున్నది. ఇక చెరువులో మట్టి పోసి ఇళ్లు మునిగేందుకు కారకులైన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మత్తడిని కూల్చిన వారిని అరెస్టు చేసినప్పుడు, చెరువులో మట్టి పోసిన వారిని ఎందుకు వదిలేశారంటూ జనం ప్రశ్నిస్తున్నారు. చట్టం అందరికీ సమానమైనప్పుడు ఈ వ్యవహారం మొత్తానికి కారకులైన వారిపై కేసులు పెట్టక పోవడమేమిటని ప్రజలు మండిపడుతున్నారు.*

శనిగకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టిపోసినట్లు చెబుతున్న ప్రదేశం (చెరువును ఆనుకొని ఉంది)

# శనిగకుంటను మింగేస్తున్న హస్తం ఎవరిదో..?

- 4 వేల ట్రిప్పులు పోస్తుంటే అధికారులు ఏం చేసినట్టు?
- అది నిబంధనలకు విరుద్ధమేనని తేల్చిన పోలీసులు
- మట్టి పోయడం వల్లే 11వ వార్డులోని ఇళ్లలోకి వరద
- శనిగకుంట మత్తడికి బాంబులు పెట్టేందుకు అదే కారణమా..
- విచారణ కొనసాగుతుందని చెప్పడం వెనుక మర్మమేమిటో..

### ఆ 15.20 ఎకరాల్లో మట్టి పోసింది అధికార పార్టీ లీడర్లే!

మంచిర్యాల, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : శనిగకుంట చెరువు మొత్తం విస్తీర్ణం 39 ఎకరాలు. దీని శిఖం 33.22 ఎకరాలు, ఎఫ్‌టీఎల్ కలుపుకొని 42 ఎకరాలు ఉంది. దీనికి బఫర్‌జోన్ కలుపుకుంటే మొత్తం 60 ఎకరాలు అవుతుంది. కానీ, ఇప్పుడు శనిగకుంట చెరువు 60 ఎకరాల విస్తీర్ణంలో కనిపించడం లేదు. 15.20 ఎకరాల్లో మట్టిపోసినట్టు అధికారులు చెబుతున్నా.. వాస్తవానికి అది 20 ఎకరాలకు పైనే ఉన్నట్లు తెలుస్తున్నది. చెరువు వెనకవైపు హైవే నంబర్-63 దగ్గర మొదలుకొని 11 వార్డు చివరి వరకు దాదాపు కిలోమీటరున్నర చెరువు లోపలికి మట్టిపోసుకుంటూ వెళ్లారు. ఈ క్రమంలో పట్టాభూములను దాటుకొని వెళ్లి చెరువులో మట్టిపోశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారమైతే చెరువును ఆనుకొని పట్టాభూములుంటే.. దానిని కేవలం వ్యవసాయం కోసమో, పాడిపశువుల మేత కోసమో ఉపయోగించాలి. అందులో ఎలాంటి నిర్మాణాలు చేయవద్దు. మట్టిపోసి ఎత్తుపెంచడం, వరద రాకుండా అడ్డుకట్టలు వేయడం అనేది నిబంధనలకు విరుద్ధం. కానీ, శనిగకుంట విషయంలో అలాంటివేవీ పాటించకుండానే ఇష్టారాజ్యంగా మట్టిపోసుకుంటూ వెళ్లారు. తమ భూమిలోని నీరు రాకుండా ఎత్తుగా మట్టికుప్పలతో కట్ట సైతం నిర్మించారు. మరో వర్షం పడితే కచ్చితంగా మట్టిపోసిన భూములోకి సైతం నీరు వచ్చేది. అదే జరిగితే రానున్న రోజుల్లో భూములను విక్రయించడం ఇబ్బంది అవుతుందని, కుట్ర చేసి మత్తడిని కూలగొట్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో అధికార పార్టీ కీలక నాయకులు ఉండడం, ఆ భూమిని ఇప్పుడు అధికారపార్టీకి చెందిన సీనియర్ నాయకుడికి విక్రయించడంతోనే అధికారులు మిన్నకుండిపోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే మత్తడి కూల్చిన వారిని అరెస్టు చేసిన పోలీసులు, చెరువులో మట్టిపోసిన వారిని వదిలేశారని స్థానికంగా చర్చ నడుస్తున్నది. మత్తడి కూల్చిన వారితో పాటు చెరువును దెబ్బతీసిన వారిని అరెస్టు చేయాలనే డిమాండ్ వినిపిస్తున్నది. అది చేయకుండా విచారణ ఇంకా కొనసాగుతున్నట్లు పోలీసులు చెప్పడం వెనుక మర్మమేమిటి అని జనాలు ప్రశ్నిస్తున్నారు.

శనిగకుంట నీరు తమ భూమిలోకి రాకుండా కట్టలా పోసిన మట్టి

### మట్టిపోశాకే.. ఇళ్లు మునుగుతున్నయ్

శనిగకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టిపోసిన నాటి నుంచే చెరువు వెనకవైపు ఉన్న 11 వార్డులోని ఇళ్లలోకి వరద వస్తుందని స్థానికులు చెబుతున్నారు. చాలా లోతుగా ఉన్న చెరువును మట్టితో నింపేశారని, దాంతో ఎగువనున్న గాలికుంట చెరువు నుంచి వచ్చి శనిగకుంటలో చేరాల్సిన వరద.. ఎత్తుకు ఎక్కలేక రివర్స్‌లో ఇళ్లలోకి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే వరదలోనే కాలం వెళ్లదీయాల్సి వస్తుందని, పాములు, తేళ్లు వస్తుండడంతో భయం భయంగా గడుపుతున్నామని, గాలికుంట నుంచి వచ్చే వ్యర్థాలు ఇళ్లలోకి వచ్చి చేరుతున్నాయని వాపోతున్నారు. పోసిన మట్టితీసి చెరువు లోతును పెంచితే తమకూ ఎలాంటి ఇబ్బందులు ఉండవంటున్నారు. 4 వేల ట్రిప్పుల మట్టి తెచ్చిపోస్తుంటే.. అడ్డుకోకుండా ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు ఏం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకొని వరద ముప్పు నుంచి తమను కాపాడాలని వేడుకుంటున్నారు. అసలు ఈ మట్టిపోసింది పట్టా భూముల్లోనేనా.. లేకపోతే చెరువు భూముల్లోనా అనేది సర్వే చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. చెరువునకు హద్దులు ఏర్పాటు చేసి దాని ఎఫ్‌టీఎల్ పరిధి, బఫర్ జోన్‌ను నిర్ణయించాలంటున్నారు. అలా చేయడంతో పాటు ఇప్పుడు బఫర్ జోన్‌లో పోసిన మట్టిని తొలగించి చెరువు చుట్టుపక్కల జననివాసం ఉండే ప్రాంతంలోకి వరద రాకుండా చూడాలని కోరుతున్నారు.

### మట్టిపోయకముందు వరద రాలే

*వర్షాలు పడ్డప్పుడల్లా శనిగకుంట చెరువు వరదంతా మా ఇంట్లోకి వస్తంది. మూడేళ్లుగా గిదే గోస. చెరువులో ఎప్పుడైతే మట్టిపోశారో అప్పటి నుంచే వరద వస్తుంది. మట్టిపోసిన భూమిలో ఎప్పుడూ నీరుండేది. అందులో మట్టిపోసి ఎత్తు పెంచడం వల్లే వరద వస్తుంది. వరదతో ఇండ్లల్లోకి పాములు వస్తున్నయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయం భయంగా గడుపుతున్నం. ఇప్పటికే దాదాపు పది పాములను చంపినం. చెరువును పునరుద్ధరించి న్యాయం చేయాలె.* **- బోగే దేవక్క, 11వ వార్డు**

### నోటీసులిచ్చాం.. తహసీల్దార్‌కు సిఫారసు చేస్తాం

*2020లో ఒకసారి చెరువులో మట్టి పోస్తుంటే మా సిబ్బంది వెళ్లి అడ్డుకున్నారు. 2022లో మరోసారి మట్టిపోయడం మొదలుపెట్టారు. కొన్ని రోజులు మట్టి పోశాక విషయం మా దృష్టికి వచ్చింది. రాత్రివేళ మట్టి తెచ్చి పోస్తున్నట్లు గుర్తించాం. వెంటనే ఆపేయాలని నోటీసులిచ్చాం. చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు సిఫారసు చేశాం. మా పరిధిలో ఏం చేయాలో అది చేశాం. ఇప్పుడు మత్తడి పేల్చివేత ఘటన నేపథ్యంలో మట్టిపోసిన వారిపై చర్యలకు మరోసారి తహసీల్దార్‌కు సిఫారసు చేస్తాం. మట్టి తొలగింపు విషయంపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం.* **- వేణు, ఇరిగేషన్ డీఈ (చెన్నూర్)**

## మత్తడి ధ్వంసం కేసులో నిందితుల అరెస్ట్

### వివరాలు వెల్లడించిన మంచిర్యాల డీసీపీ భాస్కర్

చెన్నూర్ టౌన్, సెప్టెంబర్ 20 : పట్టణంలోని శనిగకుంట చెరువు మత్తడి పేల్చివేత కేసులో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్, ఎస్ఐ శ్వేతతో కలిసి పూర్తి వివరాలు వెల్లడించారు. ఈ నెల 16న శనిగకుంట చెరువు మత్తడిని కొందరు పేలుడు పదార్థాలతో ధ్వంసం చేశారు. చెన్నూర్ నీటి పారుదల శాఖ ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. 20న అనుమానితులు పెండ్యాల లక్ష్మీనారాయణ (లక్ష్మణ్), భీం మధుకర్, రసమల్ల శ్రీనివాస్‌ను విచారించారు. గోగుల దానయ్యతో కలిసి నేరం చేసినట్లు వారు ఒప్పుకున్నారు. ఆపై అందరినీ అదుపులోకి తీసుకున్నారు. దానయ్య వద్ద ఉన్న కంప్రెషర్ డ్రిల్ మిషన్ ట్రాక్టర్, నాలుగు జిలెటిన్ స్టిక్స్, జీఐ వైరును స్వాధీనం చేసుకున్నారు.

### మత్తడి ఎత్తు తగ్గించాలని..

చెన్నూర్ పట్టణంలోని 11 వార్డులోని శనిగకుంట చెరువును ఆనుకొని 15.20 ఎకరాలను గోదావరిఖనికి చెందిన బుచ్చిరెడ్డి వద్ద చెన్నూర్‌కు చెందిన 10 మంది గ్రూపుగా ఏర్పడి కొనుగోలు చేశారు. ఆపై ఈ భూమిని చెన్నూర్‌కు చెందిన గొడిసెల బాపురెడ్డికి అమ్మేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో 4.20 ఎకరాలు మాత్రమే రిజిస్ట్రేషన్ పూర్తయ్యింది. మిగిలిన 11 ఎకరాల భూమి శనిగకుంట చెరువు ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్ లెవల్)లో ఉండడంతో రిజిస్ట్రేషన్ కాలేదు. వర్షాకాలంలో చెరువు నిండి సదరు భూమిలోకి వరద వస్తుందని, తమ భూముల వైపు భారీగా మట్టి పోయించారు. దీంతో వరద అంతా ఇండ్ల (ముంపు సమస్య పెరిగింది) వైపు రావడం మొదలైంది. ఈ సమస్య పరిష్కారం కోసం వార్డు కౌన్సిలర్ భర్త లక్ష్మణ్.. తన స్నేహితులైన భీం మధుకర్, రసమల్ల శ్రీనివాస్‌తో కలిసి మత్తడి ఎత్తు తగ్గించాలని ప్లాన్ చేశాడు. ఇందుకోసం మంచిర్యాలలోని ఏసీసీ ప్రాంతానికి చెందిన గోగుల దానయ్యను సంప్రదించారు. ఆయన సాయంతో 13న కంప్రెషర్ డ్రిల్ మిషన్‌తో ఉన్న ట్రాక్టర్‌తో మత్తడి ఎత్తు తగ్గించే ప్రయత్నం చేశారు. అది సాధ్యం కాకపోవడంతో దానయ్య సూచనల మేరకు నల్గొండ నుంచి ఆయనకు తెలిసిన వారి వద్ద నుంచి జిలెటిన్ స్టిక్స్ తెప్పించారు. ఈ నెల 16న రాత్రి పెండ్యాల లక్ష్మణ్, రసమల్ల శ్రీనివాస్ లక్ష్మణ్ బైక్‌పై, భీం మధుకర్, గోగుల దానయ్య ట్రాక్టర్ మీద శనిగకుంట చెరువు వద్దకు వెళ్లి కంప్రెషర్ డ్రిల్లర్, ట్రాక్టర్‌తో మత్తడికి రంధ్రాలు చేశారు. వాటిలో జిలెటిన్ స్టిక్స్ పెట్టి పేల్చివేశారు. ఈ కేసులో డాక్యుమెంట్స్, బ్యాంక్ అకౌంట్స్, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి చెరువు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ వివరాలు, ఆ స్థలంలో వారి ప్రమేయంపై విచారణ కొనసాగుతున్నట్లు డీసీపీ తెలిపారు. ఈ కేసును ఛేదించేందుకు కృషి చేసిన జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, చెన్నూర్ సీఐ రవీందర్, ఎస్ఐ శ్వేత, పీసీలు టిక్కయ్య, భూమన్న, అబ్దుల్ ఖదీర్‌ను డీసీపీ అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్

## పిడుగు పడి మహిళ మృతి

పోశక్క (ఫైల్)

తాండూర్, సెప్టెంబర్ 20 : అచ్చలాపూర్‌కు చెందిన గోలెం పోశక్క (55) శుక్రవారం సాయంత్రం పిడుగుపడి మృతి చెందింది. పోశక్క (55) గ్రామ శివారులోని తన పొలంలో పని చేసి తిరిగి సాయంత్రం ఇంటికి బయలుదేరింది. ఒక్కసారిగా ఉరుములు మెరుపులుతో పిడుగు పోశక్కపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమీపంలో ఉన్న ఆమె చిన్న కుమారుడు సురేందర్ పరిగెత్తుకుంటూ తల్లి దగ్గరికి రాగా, అప్పటికే మృతి చెందింది. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

శ్రీరాంపూర్ జట్టుకు బహుమతి అందిస్తున్న ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్

## శ్రీరాంపూర్ జట్టు విజయం

### ముగిసిన సింగరేణి స్థాయి వాలీబాల్ పోటీలు

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 20 : సింగరేణి స్థాయి వాలీబాల్ పోటీల్లో శ్రీరాంపూర్ ఏరియా జట్టు విజేతగా నిలిచింది. డబ్ల్యూపీఎస్‌జీఏ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో నిర్వహిస్తున్న పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఆఖరి రోజు భూపాలపల్లి-ఆర్జీ 3 జట్టుపై శ్రీరాంపూర్ విజయంసాధించింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ విజేతలకు బహుమతులు అందించి, అభినందించారు. విజేతలు కోలిండియా స్థాయిలో సంస్థకు పేరుతేవాలని ఆకాంక్షించారు. ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, డీవైజీఎం అరవిందరావు, డబ్ల్యూపీఎస్‌జీఏ గౌరవ కార్యదర్శి పాల్‌సృజన్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు నరేందర్ రెడ్డి, చాట్ల అశోక్, శ్రీనివాస్, కో-ఆర్డినేటర్ సకినాల నర్సయ్య, జనరల్ కెప్టెన్ ఎం శ్రీనివాస్, వాలీబాల్ కెప్టెన్ చిన్నయ్య, ఇండోర్ కెప్టెన్ తోట సురేశ్ పాల్గొన్నారు.

## పత్తికి మందు వేసి వస్తుండగా..

### ఒక్కసారిగా ఉప్పొంగిన ఎర్రవాగు

- ట్రాక్టర్‌తో సహా చిక్కుకున్న రైతు, ఐదుగురు కూలీలు
- కాపాడిన స్థానికులు

కన్నెపల్లి, సెప్టెంబర్ 20 : ఎగువన కురుస్తున్న వర్షాలకు చిన్న తిమ్మాపూర్-తంగళ్లపల్లి గ్రామాల మధ్యనున్న ఎర్ర వాగు ఉప్పొంగగా, ట్రాక్టర్‌తో సహా ఆరుగురు కూలీలు అందులో చిక్కుకున్నారు. మాడవెల్లి గ్రామపంచాయతీలోని బొత్తపల్లికి చెందిన అట్కారి రవి అనే రైతు ట్రాక్టర్‌లో మందు బస్తాలు వేసుకొని, ఐదుగురు కూలీలతో కలిసి వాగు అవతల ఉన్న తిమ్మాపూర్‌లోని పతి చేనుకు చేరుకున్నాడు. పత్తికి మందు వేసి తిరిగి వస్తున్న క్రమంలో వాగు ఒక్కసారిగా ఉప్పొంగింది. దీంతో ట్రాక్టర్‌తో సహా అందులో చిక్కుకుపోయారు. పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు గమనించి తాళ్ల సాయంతో ఆరుగురిని సురక్షితంగా బయటకు తీసుకు వచ్చారు. ట్రాక్టర్ వాగులోనే ఉండిపోయింది. కాగా, ఎర్రవాగుపై బ్రిడ్జి లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

వాగులో చిక్కుకున్న ట్రాక్టర్

## మాతా శిశు మరణాలను నివారించాలి

మంచిర్యాల డీఎంహెచ్‌వో డా.హరీశ్‌రాజ్

సమావేశంలో వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 20 : మాతా శిశు మరణాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంచిర్యాల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి హరీశ్ రాజ్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో గతేడాది తాండూరు, అంగరాజుపల్లి, రాజీవ్ నగర్, శంషీర్‌నగర్ పీహెచ్‌సీల్లో జరిగిన మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి గర్భిణుల వివరాలు సమోదు చేయాలని, వైద్యాధికారితో పరీక్షలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో నాలుగు మాతృ మరణాలు, రెండు శిశు మరణాలను గుర్తించామని, మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీవోలు డా.సుధాకర్, డా.అనిత, డా.కృపా, డా. సీతారామరాజు, డా.అరుణశ్రీ, ప్రభుత్వ, ప్రైవేట్ డీజీవోలు, పిల్లల వైద్య నిపుణులు, డెమో బుక్క వెంకటేశ్వర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

## బాలల హక్కులు కాపాడడం అందరి బాధ్యత

కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 20 : బాలల హక్కులు కాపాడడం అందరి బాధ్యతని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శుక్రవారం గన్నారంలోని మహాత్మా జ్యోతి బాపూలే, గిరిజన సంక్షేమశాఖ విద్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సంకల్ప కార్యక్రమంలో కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, జిల్లా సంక్షేమశాఖ అధికారి ఆడెపు భాస్కర్‌తో కలిసి పాల్గొన్నారు. ఆరోగ్యం, విద్య, సంక్షేమం, సైబర్ క్రైమ్, బాల్య వివాహాలు, బాలల తరలింపువంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. చదువుతోనే భవిష్యత్ అని, సమాజంలో గొప్ప పౌరులుగా ఎదగాలంటే ప్రతి అంశంపై అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయ కర్త శారద, పోషణ అభియాన్ జిల్లా సమన్వయకర్త గోపాల క్రిష్ణ, విద్యాశాఖ సెక్టార్ అధికారి శ్రీనివాస్, సఖీ సీఏ మమత, కౌన్సిలర్ శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాల తనిఖీ

కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ పంపు ఏరియాలోగల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్)పై 6వ తరగతి, 9వ తరగతి విద్యార్థుల అభ్యాసన సామార్థ్యలను పరిశీలించారు. ఎన్ఏఎస్‌లో భాగంగా విద్యార్థులు రాసిన పరీక్షా పత్రాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679